క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: రాఘవ రెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు ద్వారపురెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వుడా కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం 60 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 80 మంది మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కర్రి సత్యనారాయణరెడ్డి, ద్వారంపూడి చిత్రా రెడ్డి, కొవ్వూరు గోపాలకృష్ణారెడ్డి, జాగారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీలో మనస్వినికి 11వ ర్యాంకు



సంబంగి మనస్విని

గాజువాక: ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని సంబంగి మనస్విని 11వ ర్యాంకు సాధించింది. ఇటీవల విడుదలైన పాలిసెట్ ఫలితాల్లోనూ ఆమె 37వ ర్యాంకు సాధించింది. మనస్విని తండ్రి మురళీకృష్ణ ప్రైవేటు పాఠశాలలో, తల్లి అనురాధ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. మనస్విని మాట్లాడుతూ ప్రతి రోజూ ఇంట్లో ఐదు గంటల పాటు ప్రత్యేక ప్రణాళికతో చదివానని తెలిపింది. గ్రూప్స్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యమని తెలియజేసింది.

సివిల్ సప్లై సమీక్ష సమావేశంలో 'బోగాది'



సమీక్ష సమావేశంలో పాల్గొన్న సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు గురువారం అమరావతిలో జరిగిన రాష్ట్ర సివిల్ సప్లై సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన డైరెక్టర్ల సమావేశంలో రాష్ట్రంలోని సివిల్ సప్లై ఆర్థిక పరిస్థితులు, సేవలు, పలు అంశాలపై చర్చించామని బోగాది తెలిపారు.

మేధోహక్కుల పరిరక్షణలో కాపీరైట్స్ కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా 'ఏఐ జెనరేటెడ్ వర్క్స్– ఆథర్‌షిప్ అండ్ ఓనర్‌షిప్ అండ్ ద కాపీరైట్ యాక్ట్, 1957 అంశంపై ఒక రోజు జాతీయ వెబినార్ నిర్వహించింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రచయితలు, కళాకారులు, డిజైనర్లు, కంపోజర్లు, ఇతర సృజనాత్మక వ్యక్తుల కాలాన్ని, మేధస్సును పరిరక్షించే దిశగా ప్రత్యేక హక్కులు అవసరాన్ని తెలియజేశారు. భారత ప్రభుత్వ రిజిస్ట్రార్స్ ఆఫ్ కాపీరైట్ పూర్వ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.ఆర్. రాఘవేంద్ర మాట్లాడుతూ నూతనంగా ఏఐ సాంకేతికత ఆవిర్భావంతో ఎదురయ్యే సవాళ్లు, చట్టపరమైన అంశాలను విపులీకరించారు. డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ సదస్సుకు 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 862 మంది విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయవాదులు, ఐపీ నిపుణులు హాజరయ్యారని తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

- పెనుగాలులకు నేలకొరిగిన చెట్ల తొలగింపు
- పడిపోయిన విద్యుత్ స్తంభాల మార్పిడి



స్టీల్‌ప్లాంట్‌లో చెట్లు తొలగించడంతో వాహనాల రాకపోకలకు ఏర్పడిన మార్గం



70వ వార్డులో కూలిపోయిన చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

గాజువాక: గాజువాక, స్టీల్‌ప్లాంట్, అగనంపూడి తదితర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం గాలుల భీభత్సంతో చోటు చేసుకున్న ఇబ్బందులను సంబంధిత విభాగాల అధికారులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించారు. పెనుగాలులతో కూడిన వర్షానికి గాజువాకలో చెట్లు కూలిపోయి విద్యుత్‌స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం కారణంగా గాజువాకలో అంధకారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఆగమేఘాలపై స్పందించిన అధికారులు సమస్యను గంటల వ్యవధిలో పరిష్కరించారు. గాజువాక పట్టణంలోని చినగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అనేక చోట్ల చెట్లు కూలిపోగా, జీవీఎంసీ అధికారులు వాటిని తొలగించారు. ఎల్వీ నగర్, దత్తసాయినగర్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపోగా ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో వాటిని తొలగించి, కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఏఈ తెలిపారు. కాగా, భారీ గాలులకు జీవీఎంసీ 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులో 11కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో నీటి పంపింగ్ నిలిచిపోయింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ సమస్యను వెంటనే పరిష్కరించి నీటి పంపింగ్‌ను పునరుద్ధరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో అగ్రోఫారెస్ట్ సేవలు భేష్

ఉక్కునగరం: భీకర గాలులకు కకావికలమైన ఉక్కునగరంలో యథాస్థితిని పునరుద్ధరించేందుకు స్టీల్‌ప్లాంట్ అగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బంది చేసిన సేవలకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సిబ్బంది సకాలంలో చేపట్టిన పునరుద్ధరణ చర్యల వల్ల ఉద్యోగులు ఇబ్బందులు లేకుండా విధులకు హాజరవుతున్నారు.

హుద్‌హుద్‌ను తలపించేలా బుధవారం సాయంత్రం వచ్చిన భీకర గాలులు ఉక్కునగరాన్ని కకావికలం చేయడంతో అన్ని రహదారుల్లో వందలాది చెట్లు నేలకొరిగిన సంగతి తెలిసిందే. విరిగిన చెట్లతో రోడ్లన్నీ దిగ్బంధమయ్యాయి. అదే విధంగా అగనంపూడి నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే జనరల్ ఆస్పత్రి రహదారి, కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారిదీ ఇదే పరిస్థితి. దీంతో ఆ రహదారుల్లో ప్రయాణించే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఇళ్లకు చేరుకోవడానికి ఇబ్బంది పడ్డారు. గాలుల వల్ల చాలా సెక్టార్లలో క్వార్టర్ల నుంచి ఉద్యోగులు బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. తాత్కాలిక కారు షెడ్లపై చెట్లు పడటంతో అనేక కార్లు, బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలపై చెట్లు పడటంతో పాడయ్యాయి. సెక్టార్–7లో పురాతన మర్రి చెట్టు కూలిపోగా కొన్ని స్తంభాలు విరిగి పడ్డాయి. విషయం తెలిసిన అగ్రోఫారెస్ట్ విభాగం రాత్రి 7.30గంటల నుంచి పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. 20 మంది హోంగార్డులు, 20 మంది నిర్వాసిత కార్మికులతో రాత్రి 11 గంటల వరకు ప్రధాన రహదారుల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. మరలా గురువారం ఉదయం 6 గంటల నుంచి చెట్లు తొలగింపు చర్యలు ప్రారంభించారు. టౌన్‌అడ్మిన్ పబ్లిక్ హెల్త్ సెక్షన్ సహకారంతో మొత్తం 150 మంది నిర్వాసిత కార్మికులు, ఫీల్డ్ మిషనరీ విభాగానికి చెందిన రెండు జేసీబీలు, రెండు లోడర్లను ఉపయోగించి మధ్యాహ్నానికి అడ్డంకులు తొలగించే పనులు పూర్తి చేశారు. రోడ్డు అడ్డంకి నుంచి క్లియర్ చేసిన విరిగిన చెట్లను అగ్రోఫారెస్ట్ విభాగానికి రవాణా చేసే పనులు పూర్తవడానికి మరో రెండు రోజులు పడుతుందని విభాగం అధికారుల సమాచారం.



కూలిపోయిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రోడ్డుకు అడ్డుగా పడిపోయిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది



క్వార్టర్లలో మార్గం కల్పిస్తున్న సిబ్బంది

ఉక్కు యువకుల స్పందన

స్టీల్‌ప్లాంట్ ఎస్.ఎం.ఎస్–2 ఉద్యోగులు హిమాన్షు, అనిల్, అనిల్ కుమార్ మాజీ ఉద్యోగి కాసా పద్మరాజు నేతృత్వంలో ముందుకు వచ్చి కొన్ని రోడ్లపై ఉన్న చెట్లను తొలగించారు. మాన్యువల్ కటింగ్ మిషన్ తీసుకువచ్చి అడ్డుగా ఉన్న కొమ్మలను వేరు చేసి, అక్కడ నుంచి తరలించారు. దీంతో వారిని ఉద్యోగులు అభినందించారు.

నేలకొరిగిన 40 విద్యుత్ స్తంభాలు

అగనంపూడి: ఈదురుగాలుల బీభత్సానికి ఎక్కడికక్కడే విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. దీంతో అగనంపూడి, లంకెలపాలెం సెక్షన్ కార్యాలయ పరిధిలోని గ్రామాల్లో 20 నుంచి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినా కొన్ని ప్రాంతాల్లో గురువారం సాయంత్రానికి గానీ విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం పడడంతో అగనంపూడి, దువ్వాడ, మంగళపాలెం, లంకెలపాలెం, ఫార్మాసిటీ కాలనీలు, అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో భయానక వాతావరణం నెలకొంది. హైవేతో పాటు రోడ్లపై చెట్లు విరిగి, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. కొండయ్యవలస, సెక్టార్–1లో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్లు, స్తంభాలు పడిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం అయ్యాయి. దీంతో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు బయట లేకపోవడంతో ప్రమాదం తప్పిందనే చెప్పాలి. అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల్లో 40 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా ధ్వంసం కాగా, మూడు పాక్షికంగా దెబ్బతిన్నట్టు అధికారులు చెప్పారు. రెండు సెక్షన్ కార్యాలయాల పరిధిలో సిబ్బంది నిద్రాహారాలు మాని, శ్రమించడంతో విద్యుత్ పునరుద్ధరణ సాధ్యమైంది.



స్తంభాలపై చెట్లు, కొమ్మలు పడడంతో విరిగిన విద్యుత్‌స్తంభాలు



కొండయ్యవలసలో ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



దువ్వాడ సమీపంలోని కాలనీలో నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 72వ వార్డులో రూ.1.07లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నిధులతో చైతన్యనగర్, వుడా కాలనీలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వందడుగుల రోడ్డులోని అంబేడ్కర్ పార్కు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, కాలువలు, కల్వర్టులు, ప్రహరీ మరమ్మతులు చేపడుతున్నామన్నారు. గాజువాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, స్థానిక నాయకులు దుర్గా ప్రసాద్, ప్రభాకర్, కర్రి నాగేశ్వరరావు, అప్పలస్వామి, మద్దాల రామారావు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వేద పండితుల

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని సీతారామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో 21 మంది దంపతులతో స్వామి ఆలయంలో మాలధారణ చేశారు. అలాగే విష్వక్సేన పూజ, హోమ ప్రతిష్ఠ, వినాయక పూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, సత్యారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, పిట్ట రమణ, దేవాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: ఇటీవల ఒడిశాలో చోటుచేసుకున్న ఘోర రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి అగనంపూడి అఖిలపక్ష నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తొలుత మినీ జగదాంబ జంక్షన్ నుంచి అగనంపూడి జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని, మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైల్వే సీసీ సభ్యుడు కొలిపాక అప్పారావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కడిమి హనుమంతరావు, దొడ్డి దేముడు, బలిరెడ్డి శ్రీను, గుదే సుశీల గజేంద్ర, స్థానిక యువకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలి



847వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 847వ రోజు, గురువారం స్టీల్‌ప్లాంట్‌లోని ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సముద్రాలను సంరక్షించాలి



తీరప్రాంతంలో ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఏయూక్యాంపస్: సముద్రాలను సంరక్షించాల్సిన బాధ్యతను యువత గుర్తించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీచ్‌రోడ్డులో తీరప్రాంత శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులతో పాటు నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగర తీరంలో పేరుకుపోయిన దాదాపు 55 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులతో కలసి ఏరివేసి, జీవీఎంసీ పారిశుధ్య విభాగానికి అందజేశారు. ఎంఎల్ఆర్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు గ్రంథాలయ సభ్యత్వాలు



సభ్యత్వం స్వీకరించిన చిన్నారులు

గాజువాక: గాజువాక గ్రంథాలయంలో పలువురు చిన్నారులకు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ గురువారం సభ్యత్వాలను అందజేశారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇక్కడ వివిధ అంశాలపై చదవడం, రాయడం, చర్చించడం తదితర అంశాలపై తర్ఫీదు పొందిన వారిలో పలువురు గ్రంథాలయ సభ్యత్వాలను తీసుకోవడానికి ఆసక్తి చూపించినట్టు గ్రంథాలయాధికారి తెలిపారు. దీంతో వారికి సభ్యత్వాలను అందజేసి ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో ఆరోగ్య భరోసా



హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

గాజువాక: ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా దేశ ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య భరోసాను కల్పించిందని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉన్ని కృష్ణన్ అన్నారు. గాజువాక హైస్కూల్ రోడ్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉపన్యాసం, క్విజ్ పోటీలు

బీచ్‌రోడ్డు: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమెన్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.కె.ఎం. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కార మార్గాలు' అంశంపై మూడు నిమిషాల పాటు ఉపన్యాసం ఇవ్వవలసి ఉంటుందని పేర్కొన్నారు. క్విజ్ పోటీలను కూడా నిర్వహిస్తామని తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు 99490 24249 నంబరుకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐదేళ్ల కల.. నెరవేరిన వేళ

- రూ.8.5లక్షలతో మంచినీటి పైపులైన్ ఏర్పాటు
- చైతన్యనగర్ వాసులకు తీరిన తాగునీటి కష్టాలు



మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: తాగునీటి కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న ఆ కాలనీవాసుల కష్టాలకు ముక్తి లభించింది. మున్సిపల్ కుళాయిల కోసం డిపాజిట్లను చెల్లించినా, వారి సమస్యను అధికారులు పరిష్కరించలేక పోయారు. కాలనీవాసుల ద్వారా విషయం తెలుసుకున్న 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్ సమస్యను ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. స్థానిక చైతన్యనగర్‌లోని దాదాపు 70 నివాసాలకు జీవీఎంసీ అధికారులు ఐదేళ్లుగా నీటి కుళాయిలను మంజూరు చేయలేకపోయారు. వ్యక్తిగత కుళాయిల కోసం కాలనీవాసులు డిపాజిట్లు చెల్లించినా అక్కడ వాటర్ సప్లై డిస్ట్రిబ్యూషన్ లైన్ కనిపించకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. పైప్‌లైన్ కోసం భూమి లోపలికి ఆరడుగుల లోతు తవ్వినప్పటికీ కనిపించకపోవడంతో, కొత్త పైప్‌లైన్ వేయాల్సిన అవసరాన్ని గుర్తించినా చర్యలు చేపట్టడానికి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కాలనీవాసుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీనివాస్ సమస్యను ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన కొత్తపైప్‌లైన్‌కు రూ.8.5 లక్షల నిధులను మంజూరు చేశారు. వెంటనే స్పందించిన అధికారులు పైప్‌లైన్ వేసి ఆ ఇళ్లకు వ్యక్తిగత కుళాయిలను మంజూరు చేశారు. వాటిని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు డి.సత్యనారాయణ, ఉరుకూటి అప్పారావు, ధనలక్ష్మి, విజయ, వాసవినాయుడు, మధుసూదన్‌రెడ్డి, నాగమణి, నర్సింగరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యువతికి రక్షణ



యువతిని జ్యోతిర్మయికి అప్పగిస్తున్న జీఆర్‌పీ సిబ్బంది

అల్లిపురం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఒక యువతిని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. గాజువాక ప్రాంతానికి చెందిన కె.కీర్తన తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో ఏడాది క్రితం మృతి చెందారు. సైకిల్ మీద వెళ్తున్న వారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయారు. అప్పటి నుంచి ఆమె అనాథలా రోడ్డుమీదే ఉంటుంది. ఐదు రోజుల క్రితం ఆమె రైల్వేస్టేషన్‌లో ఉండగా జీఆర్‌పీ పోలీసులు ఆమెను గమనించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను షెల్టర్‌కు తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. ఆమె డిగ్రీ చదువుకోవటంతో ఆమెకు ఉపాధి కల్పిస్తామని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

'త్వమేవ శరణం మమ' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం నారాయణరావు

ఉక్కునగరం: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వి.ఎస్.ఆర్. మూర్తి రచించిన 'త్వమేవ శరణం మమ' గ్రంథాన్ని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ నారాయణ రావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత మూర్తి మాట్లాడుతూ మానవాళికి సేవానిరతికి మార్గదర్శకంగా నిలిచిన భగవత్ స్వరూపం సత్యసాయిబాబా అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్న మార్గంలో 150కు పైగా దేశాల్లో కోట్లాది మంది భక్తుల్లో సేవాభావం, స్ఫూర్తిని కలిగించిన మహావ్యక్తి సత్యసాయి అన్నారు. సత్యసాయిని దర్శించుకుని 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆవిష్కరించుకుంటున్న గ్రంథమిది అని తెలియజేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెదరాజు తదితరులు ఈ పూజ చేశారు. ఏఈవో నరసింహరాజు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.